క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఆటోలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నాగార్జున

పగిడ్యాల: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున హెచ్చరించారు. శుక్రవారం నందికొట్కూరు– పగిడ్యాల రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ త్రీ వీలర్ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇటీవల తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అనంతరం వాహన రికార్డులు లేని వాహనాలకు దాదాపు రూ. 5 వేలు జరిమానా విధించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించాలి

ఆత్మకూరు: ప్రజలను అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం కావడంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని,ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర అధికారి భీముడు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేకంగా పాలిస్తున్న కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు అందరూ కలిసిరావాలని కోరారు.ఈ నెల 14 నుంచి 30 వరకు నిర్వహించనున్న ప్రచార ఆందోళన ప్రారంభ సభలో వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

జార్జిరెడ్డికి నివాళి




జార్జిరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నందికొట్కూరు: విప్లవ విద్యార్థి ఉద్యమకారుడు జార్జిరెడ్డి అని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మద్రిస్వామి అన్నారు.శుక్రవారం పట్టణంలోని ఆ యూనియన్ కార్యాలయంలో ఉద్యమకారుడు జార్జిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు అన్యాయం జరిగితే వెంటనే జార్జిరెడ్డి స్పందించేవారని మద్రి స్వామి అన్నారు. ప్రతి విద్యార్థి నాయకుడు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సాయిప్రకాష్, ప్రణయ్, అరవింద్, మస్తాన్, బాలగోపాల్, స్వాములు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నందికొట్కూరు: పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

మొక్కజొన్న పంటలు దగ్ధం



మొక్కజొన్న పంట పొలాన్ని పరిశీలిస్తున్న సర్పంచు, సీపీఎం నాయకులు

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న, కంది పంటలు, విద్యుత్ వైర్లు,స్టార్టర్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియదు. అయి తే, ఈ ఘటనతో బాధితరైతులు కలబండి చిన్న శరవన్న,పెద్ద స్వాములు, వేల్పుల ప్రసాద్ 4, బాలయ్య, సంగెం పరమేశ్వరుడు, ప్రకాష్‌రావుకు మొత్తం రూ. 10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదం విషయం తెలియగానే కాలి బూడిదైన పంటలను సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు గోపాల్, సీపీఎం పార్టీ నాయకులు సామన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాలయ్య, నాయకులు వెంకటేశ్వరరావు పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.



ఆత్మకూరు.. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..



నందికొట్కూరు.. మున్సిపల్ కార్యాలయంలో..



కొత్తపల్లి.. నందికుంటలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే



నందికొట్కూరు.. ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఐజయ్య

ఆదర్శనీయులు అంబేడ్కర్

ఊరూరా ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెచ్ జయంతి వేడుకలు



నందికొట్కూరు కేజీ రోడ్డు.. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయులని వక్తలు అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా వివిధ వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఊరూరా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

☛ నందికొట్కూరు పట్టణం, మండలంలో వేర్వేరుగా జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, మునిసిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ షేక్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, సింగిల్‌విండో చైర్మన్ హుసేనయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు లాలు, సురేష్, చిన్నరాజు, రవూఫ్, హమీద్, ధర్మారెడ్డి, జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి పెద్ద చదువులు చదివిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ప్రపంచంలోనే గొప్ప మేధావి కావడంతో భారత రాజ్యాంగ నిర్మాత బాధ్యతలు ఆయనకు అప్పగించారని చెప్పారు. భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తిదాయకుడు, మార్గ నిర్దేశకుడన్నారు. మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, శాప్ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్ ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యాటఓబులేసు, జిల్లా అధ్యక్షుడు రమణ, నాయకులు డాక్టర్ రాజు, అబుబక్కర్, జబ్బార్, ఆర్ట్ శ్రీను, రమేష్, రజినీకుమార్‌రెడ్డి, సత్యనారాయణ, రమేష్, అయ్యన్న, గౌడు, ప్రజా సంఘాల నాయకులు శివప్రసాద్, నగేష్, స్వాములు, డాక్టర్ రాజు, బాలస్వామి, వెంకటేష్, శ్రీను, బీజేపీ నాయకులు వెంకటేష్, మురళీ, ఆంజనేయులు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు:అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ ఆసియా మారుఫ్, ఆర్డీఓ దాసు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి మున్సిపల్ చైర్ పర్సన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ర్యాలీగా పాతబస్టాండ్ వరకు బయల్దేరి అక్కడ రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రాజగోపాల్, ఎంపీపీ తిరుపాలమ్మ, యోగి వేమనయూనివర్సిటీ ప్రొఫెసర్ నాగరాజు, ఎస్.కేయూనివర్సిటీ ప్రొఫెసర్ సుదర్శనం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాములపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఆర్థర్ పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ చౌడయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

☛ తుమ్మలూరు గ్రామంలో ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో వైఎస్ఆర్‌సీపీ నాయకులు రామలింగేశ్వరరెడ్డి, సర్పంచు వరప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: దేశానికి మార్గదర్శనం చూపించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగరాజు, ఆత్మకూరు ప్రముఖ వైద్యుడు నాగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని నందికుంట గ్రామంలో వారు అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

☛దుద్యాల గ్రామంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, సర్పంచ్ శోభలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, కొత్తపల్లి, నందికుంట గ్రామాల్లో కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్‌కుమార్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కులవివక్షపోరాట సమితి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో సింగరాజు పల్లె గ్రామం నుంచి కొత్తపల్లి అంబేడ్కర్ విగ్రహం వరకు బైకుర్యాలీ నిర్వహించారు.

☛ గ్రామ సచివాలయాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆత్మకూరు ఆర్డీఓ దాసు, ఎంపీడీఓ మేరి, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, సర్పంచులు మారెన్న, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలకేంద్రం తహసీల్దార్ కార్యాలయంతో పాటు గ్రామాల్లోని సచివాలయాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. తహసీల్దార్ సిరాజుద్దీన్, సచివాలయ ఉద్యోగులు రాజ్యాంగ నిర్మాతకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జయలక్ష్మమ్మ, మదార్‌సాహెబ్ ,ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతీ, ఎస్‌ఐ నాగార్జున, మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు తదితరులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జూపాడుబంగ్లా: అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచులు ప్రకాశం, బాలమద్దిలేటి, నిర్మలమ్మ, నాగార్జునరెడ్డి, మొట్టిబాలయ్య, ఎంపీటీసీలు కృపాకర్, మోతెవెంకటమ్మ తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు.

వెలుగోడు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ వేల్పుల జయపాల్, ఎస్‌ఐ జగన్ మోహన్, యూటీఎఫ్ ఉపాధ్యాయులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్‌పూలమాలలు వేసి నివాళులర్పించారు. థెరిసా స్కూల్లో హెచ్‌ఎం అతావుల్లా, సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, వేల్పనూరు గ్రామ సచివాలయంలో ఎంపీటీసీలు జనాభారెడ్డి, పల్లె వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ సర్దార్‌మియ్యా అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: బాబాసాహెబ్ జయంతిని పురస్కరించుకుని శ్రీశైలంప్రాజెక్ట్‌లో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవనం నుంచి ప్రదర్శనగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటీడీఏ కార్యాలయంలో పీఓ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో, మాలమహానాడు ఆధ్వర్యంలో రింగ్‌పార్క్ వద్ద, మాదిగ దండోరా ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ భవనం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు.



మిడుతూరు.. గ్రామ సచివాలయం వద్ద..



పగిడ్యాల.. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో..



జూపాడుబంగ్లా.. ఎంపీడీఓ కార్యాలయంలో ..



శ్రీశైలం ప్రాజెక్టు.. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

జగనన్నను ఆశీర్వదించండి

జూపాడుబంగ్లా: రాబోయే ఎన్నికల్లో మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఆశీర్వదించాలని సర్పంచులు వంగల లక్ష్మీదేవి, మొట్టిబాలస్వామి, వైఎస్సార్సీపీ నాయకులు జంగాలపెద్దన్న, ఉస్మాన్ బాషా, వంగల కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా గ్రామాల్లో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి జగన్ మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన స్టిక్కర్లను అతికించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, జంగాలపెద్దన్న, సర్పంచ్ మొట్టిబాలయ్య, గృహసారథులు పెద్దసుబ్బయ్య, గోవర్ధన్, పురుషోత్తం, లక్ష్మీనారాయణ, శివన్న, ఖాజాబీ, విజయకుమారి, గంగావతి, రామారావు, యాసిన్, పుల్లంరాజు, సావిత్రి, రవి, ఇద్దూర్, వలంటీర్లు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ సీపీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సర్పంచు వరప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రామలింగేశ్వరరెడ్డి, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు. వేంపెంట గ్రామంలో సర్పంచు మాణిక్యమ్మ, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు.

పగిడ్యాల: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి, జగనన్న పాలన గురించి వివరిస్తున్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామలమ్మ, గృహ సారథులు రాంబాబు, నాగశేనారెడ్డి, తులసి, బాషా, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, కురువ మద్దిలేటి, తుమ్మకొమ్మ భాస్కర్, నారాయణ, రమణప్రసాద్, దివాన్‌సాహెబ్, అస్లాంబాషా, పులేంద్రనాయుడు, పాలూరు వెంకటేశ్వర్లు, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని 4,5వ సచివాలయాల పరిధిలో సచివాలయ కన్వీనర్లు ఏర్వ శ్యామలమ్మ, సుబ్బారెడ్డి నేతృత్వంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు గత నాలుగేళ్లలో ఏ మేరకు లబ్ధి కలిగిందో ప్రజలకు వివరిస్తూ వారి అనుమతితో ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్నారు.

శ్రీశైల భ్రమరాంబాదేవికి ఊయలసేవ



ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులు చేసి షోడశోపచార పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు చేశారు.

గిరిజన నాయకుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం దేవస్థానంలో తోటమాలిగా పనిచేసే స్థానిక ఎస్టీ కాలనీ యువకుడు సంతోషనాయక్‌ది ఆత్మహత్య కాదని హత్యేనని గిరిజన సంఘాల నాయకులు ఆరోపించారు. స్థానిక ఔటర్ రింగ్‌రోడ్ ప్రాంతంలో గత బుధవారం సంతోష్‌నాయక్ (24) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తుండగా ఎస్టీ కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్రకార్యదర్శి రవినాయక్ అక్కడికి చేరుకున్నారు. మృతుడి తల్లిదండ్రులు, బంధువుల నుంచి సమాచారం తెలుసుకొని ఇది ఆత్మహత్య కాదని హత్యేనని వారు ఆరోపించారు. కేసు నమోదు, దర్యాప్తులో నిర్లక్ష్యం వహించిన వన్‌టౌన్ ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని, హత్య కేసుగా నమోదు చేసి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై గంటసేపు రాస్తారోకో నిర్వహించారు.

ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: పూటుగా మద్యం తాగి మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పక్కీర్‌సాహెబ్, మహిళా సంఘం నాయకురాలు ఈశ్వరమ్మ, ఆర్. జయ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు తర్తూరు గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ బతుకు తెరువులో భాగంగా తర్తూరు జాతరకు వచ్చి జాతరలో జాయింట్‌వీల్ వేసుకుని మహారాష్ట్రకు చెందిన కొంత మంది జీవనోపాధి పొందుతున్నారన్నారు. గురువారం రాత్రి ఓ వ్యక్తి జాతరలో పూటుగా మద్యం తాగి జాయింట్ వీల్ ఆడిస్తున్న వారి గుడిసెల వద్దకు వెళ్లి మైనర్ బాలికను బలవంతం చేసేందుకు యత్నించినట్లు తెలిపారు. బాలిక గట్టిగా కేకలు వేయటంతో తల్లిదండ్రులు వెళ్లి సదరు వ్యక్తిని పోలీసులకు పట్టించినట్లు తెలిపారు. అయితే, బాధితురాలి తరఫు బంధువుల పిర్యాదు ఇవ్వలేదనే సాకుతో నిందితుడిపై కేసు నమోదు చేయకపోవటం తగదన్నారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకుడు కర్ణ, మహిళా సంఘం నాయకురాళ్లు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి

కర్నూలు కల్చరల్: కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని బీజేపీ నేత టీజీ వెంకటేష్ అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకలు, నాటక పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలను ప్రారంభించిన టీజీ మాట్లాడుతూ రెండు రోజుల పాటు పౌరాణిక నాటక పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని మొత్తం 16 నాటక సమాజాలు పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. 16వ తేదీ సాయంత్రం 7 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో నంది బహుమతులను సాధించిన శ్రీకృష్ణ కర్ణార్జునీయం పద్యనాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమ నిర్వహణ కన్వీనర్లు లక్ష్మీకాంతరావు, రాజారత్నం, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిషిప్‌పై అవగాహన

నంద్యాల(సిటీ): జాతీయ అప్రెంటిషిప్‌పై అవగాహన కార్యక్రమం డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ రాయపురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్, డైరెక్టరేట్ జనరల్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ అప్రెంటిషిప్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు అప్రెంటిషిప్ ద్వారా పొందే ప్రయోజనాలు, పలు సంస్థలలో వారు నిర్వహించాల్సిన విధుల గురించి వివరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి వ్యాపార వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు హాజరవుతారని వివరించారు.

16 నుంచి ధరిత్రి వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: భారత ప్రభుత్వ పృథ్వీ విజ్ఞాన మంత్రిత్వ శాఖ, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు ప్రపంచ ధరిత్రి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం వీఆర్ కాలనీలోని నైస్ సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి కల వారు ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారికి ఈ నెల 21న సన్మానం ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేసిన కార్యక్రమాల వివరాలతో కూడిన బయోడేటాను 16వ తేదీలోగా నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం



బాధితులను పరామర్శిస్తున్న శిల్పా భువనేశ్వర్ రెడ్డి

మహానంది: అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధమవ్వటంతో ఆర్థికంగా నష్టపోయిన పుట్టుపల్లె గ్రామానికి చెందిన తులసమ్మను వైఎస్సార్‌సీపీ నియోకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల నాయకులు శుక్రవారం పరామర్శించారు. మహానంది దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి , జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర్ రెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, బుక్కాపురం సచివాలయ కన్వీనర్ రఘురామిరెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా శిల్పా భువనేశ్వర్ రెడ్డి రూ.పదివేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామానికి చెందిన మికాయిలు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు ఎల్లారెడ్డి మృతుని కుటుంబానికి శుక్రవారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ రమణారెడ్డి, గ్రామనాయకులు తెలుగు సాంబ, అంజి, రాజేష్, బాలు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా టెంకాయల విక్రయాలు



శుక్రవారం తర్తూరు దేవాలయం వద్ద టెంకాయలు విక్రయిస్తున్న వ్యాపారస్తుడు



గడువు ముగిసినా దేవాలయం లోపల లడ్డూలను విక్రయిస్తున్న వ్యాపారస్తుడు

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో టెంకాయలు, లడ్డూల విక్రయానికి టెండరు గడువు ముగిసినా టెండరు దారుడు యథేచ్ఛగా దేవాలయం వద్ద టెంకాయలు, లడ్డూలు విక్రయిస్తున్నాడు. మార్చి 24న టెంకాయలు, లడ్డూలు, కొబ్బరి చిప్పలపోగుకు దేవాలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వేలాలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో 75 గ్రాములున్న లడ్డూను రూ.15కు విక్రయించాలని, మీడియం సైజు టెంకాయ ఒకటి రూ.25 చొప్పున విక్రయించాలని ఖరారు చేశారు. మార్చి నెల 29 నుంచి ఈనెల 12వ తేదీ వరకు మాత్రమే టెంకాయలు, లడ్డూలను విక్రయించుకోవాలని సూచించారు. నిబంధనలకు లోబడి విక్రయాలు జరపకపోతే టెండరు రద్దు చేస్తామని హెచ్చరించారు. వేలం పాటల్లో బాలన్న అనే వ్యక్తి లడ్డూలను రూ.91వేలకు, టెంకాయలను రూ.3,41,000కు వేలం పాడి దక్కించుకున్నాడు. మొదట్లో రెండు, మూడు రోజులు టెంకాయను రూ.25కే విక్రయించాడు. ఆ తర్వాత నిర్ణయించిన ధరకంటే అధికంగా ఓ టెంకాయను రూ.30 , అలాగే మూడు లడ్డూలు కలిపి రూ.50కు విక్రయిస్తున్నాడు. ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పట్టించుకోకపోవడంతో నేటికీ అదే ధరలకే అమ్మకాలు చేస్తున్నాడు. టెండర్ గడువు ముగియడంతో అధికారులు స్పందించి జాతరలో విక్రయాలు నిలిపివేయాలని భక్తులు కోరుతున్నారు.